# పడిలేచిన కెరటం

– గంటి భానుమతి



(గత సంచిక తరువాయి)

అయినా రోజూ ఎక్కడో అక్కడ ఈ మెథడ్ ని అవలంబించి, రైతులు, కట్నం వేధింపుల బాధితులు, అప్పులు తీర్చలేని వాళ్ళు, చేస్తున్నది ఇదే. ఇది చాలా కామన్ మెథడ్ అయిపోయింది . అమ్మ చీర తీసుకుని ,ఫాన్ కి కట్టేసి, నేను గనక ముడి సరిగా వేయగలిగితే సక్సెస్ అవుతాను కాని ఈ ప్రాసెస్ లో పూర్తిగా ఉండగలనా. మరోసారి ఇంటర్ లో ఉండగా ఇలాగే పోయిన క్లాస్మేటులు ఇద్దరూ గుర్తొచ్చారు, ఆ రోజున ఎంత గొడవ జరిగిందో పోలీసులు ,పేరెంట్స్, విద్యార్థి సంఘాలు. రిపోర్టర్లు, పోస్ట్ మార్టం, చాలా తతంగం. ఊహించుకున్నాను. ఆ కష్టం అమ్మా వాళ్ళకి ఇవ్వ దలుచుకోలేదు. చావడానికి ఇంకా ఏం మార్గాలున్నాయో ఆలోచిస్తున్నాను.

పోనీ నేను తీసుకునే మందు ఎక్కువ వేసుకుంటే. దాన్ని నాన్న ఫ్రిజ్ పైన ఓ ప్లాస్టిక్ పెట్టెలో ఉంచారు. దాన్ని తీసుకుని వేసుకోడం పెద్ద కష్టం కాదు. ఐతే అవి పూర్తిగా పని చెయ్యకపోతే. రోజుల తరబడి అలా నిద్ర పోతూంటే, కోమా లోకి వెళ్ళిపోతే.ఎవరు చూడాలి? ఆసుపత్రిలో ఉంచేస్తే, రోజూ అటూ ఇటూ ఎవరు తిరగాలి? ఈ వయసులో నేను ఇలాంటి ప్రయత్నాలు చేస్తే అమ్మా నాన్నని కష్ట పెట్టడం తప్ప మరేం లాభం ఉండదు.

అన్నిటికన్నా సులువు కాదు కానీ ష్యూర్ గా పోయే విధానం. టెర్రేస్ మీద నుంచి కిందకి పడడం. ఆ ఆలోచన రావడమే తడవు గదిలోంచి బయటికి వచ్చాను. అమ్మ అనుమానంగా చూసింది, ఎక్కడికీ అన్నట్లు. "టెర్రేస్ పైకి,చక్కటి గాలి వీస్తోంది.కొంచెం చేంజ్.".అని అన్నాను. ఎంత సులభంగా అబద్ధం ఆడేసాను. ఈ మధ్యనాకు అబద్ధాలు ఆడడం బాగా వచ్చింది. ఏమాత్రం ఆలోచించకుండా ఆడేస్తున్నాను. అమ్మ వెంటనే తన చీరని సవరించుకుంది. జుట్టుని పైపైనే వేళ్ళతో దువ్వుకున్నట్లు చేసింది. "పద నేను కూడా వస్తాను," అంటూ తాళం చేతులు తీసుకుంది.

నేను ముందు నడుస్తూంటే అమ్మనా వెనకాలే టెర్రేస్ మీదకి వచ్చింది. నేను ఓ వైపు నడిస్తే అమ్మ మరో వైపు నడుస్తోంది. గోడ మీద నుంచి కిందకి చూస్తూ కొంచెం దూరం నడిచాను. లాభం లేదు,ఇక్కడ అన్నీ బాల్కనీలు అడ్డొస్తున్నాయి. ఇక్కడి నుంచి దూకడం కష్టం. పైగా ఎవరి బల్కనీలో నైనా పడితే పరవాలేదు, కానీ,సగం సగం గా పడితే,పడుతున్నప్పుడు వచ్చే శబ్దం చుట్టు పక్కల వాళ్ళకి తెలివి వచ్చేస్తే..పెద్ద గొడవ. అదో పెద్ద సినిమా.

కొంచెం దూరం నడిచాను. కిందకి చూసాను. కింద వాకింగ్ ట్రాక్. చెట్లు. కొన్ని పొట్టి చెట్లు. కొన్ని పొడుగువి. ఇక్కడ చెట్లు అడ్డొచ్చాయి. చెట్టు మీద పడితే. లాభం లేదు. ఇంత కన్నా మంచి చోటు చూసి పడాలి. అలా అలా చూస్తూ వెళ్ళాను. కిందనుంచి పైవరకూ ఉన్న పైపులు మూలంగా తెలుస్తోంది అక్కడ బాత్రూములు,టాయిలెట్లున్న ప్లేస్ అది అని. ఇది కరెక్ట్ ప్లేస్ ,చాలా కరెక్ట్ గా ఉంటుంది అనిపించింది. అక్కడ ఏదీ అడ్డు రాదు. డైరెక్ట్ గా కింద పడతాను. అంతే అక్కడితో ఈ ఛాప్టెర్ క్లోజ్,అయిపోతుంది. నేను నుంచున్న దగ్గరే ఓ

నీళ్ళ టాంకు ఉంది. టాంకుకి పిట్టగోడకి మధ్య ఉన్న స్థలం సన్నగా ఉంది. అక్కడ మనుషులు  ఎవరున్నా దూరంనుంచి కనిపించరు. అక్కడినుంచి కింద పడినా ఎవరికి పెద్దగా కనిపించదు. ఎందుకంటే ఆ టైములో ఎవరూ జాగింగ్,వాకింగ్ అదీ చెయ్యరు. అంతే కాకుండా యాంగిల్ అది సరిగ్గా ఉంటుంది. రోడ్డు కూడా చాలా వెడల్పుగా ఉంటుంది. ఐడియల్ ప్లేస్.

అంత పెద్ద టెర్రేస్ మీద ,రాత్రి వేళ ఏమాత్రం కన్ఫ్యూజన్ అవకుండా ఆ నీళ్ళటాంకు బండ గుర్తు పెట్టుకున్నాను. ఏదో కాస్సేపు అటూ ఇటూ చూస్తూ అమ్మవైపు చూసాను ఇంక వెళ్దామన్నట్లుగా. అమ్మకూడా తల ఊపి నా చేయి పట్టుకుని ఇంటికి తీసుకొచ్చింది.

రాత్రి మామూలుగానే ఉన్నాను. మనసులో నేను చేయబోయే దాని గురించి ఆలోచిస్తూనే ఉన్నాను. అన్నం తిన్నాను. మందులు వేసుకున్నాను. అలవాటయి పోయిందేమో ఇది వరకూ లాగా వెంటనే నిద్ర రావడం లేదు. మంచం మీద పడుకున్నాను. గడియారం కేసి చూస్తున్నాను. నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. ఓ మొద్దులా ఉన్న నేను ఇంత పెద్ద ప్లాను ఎలా వేసాను.?ఇప్పుడు దాన్ని ఎక్జిక్యూట్ చేసే ప్రయత్నంలో ఉన్నాను. అయితే నేను సక్సెస్ అవుతానా

అమ్మా నాన్న గారు పడుకున్నారని గట్టిగా నిశ్చయించుకున్నాకా మెల్లిగా లేచి పైకెళ్ళాను. పైన అంతా నిశ్శబ్దంగా ఉంది. ఆకు కూడా కదలడం లేదు. మామూలుగా అయితే వాచ్మెన్ ఓ కర్ర పుచ్చుకుని టక టకమంటూ కొట్టుకుంటూ బిల్డింగ్ ల మధ్య నుంచి వెళ్తూంటాడు. నాకు ఈ సంగతి బాగా తెలుసు ఎందుకంటే  రోజూ నిద్ర లేని రాత్రుళ్ళు కాబట్టి,  ఈ శబ్ధాలు వింటూ గడిపేదాన్ని. ఎందుకో మరి,ఇప్పుడు ఆ శబ్ధం కూడా లేదు.

ఓసారి చుట్టూ చూసాను. ఎవరూ లేరని పించింది.నీళ్ళటాంక్ వైపు వెళ్ళాను. మెల్లిగా టాయిలెట్లుండే వైపు వెళ్ళాను, ఓసారి చుట్టూ చూసాను. ఎవరూ కనిపించలేదు. ఇప్పుడు  టెర్రెస్ గోడ ఎక్కాలి. ఇంక ఇవే ఆఖరి క్షణాలు. మరో ఐదు నిమిషాలకి నాకు ఈ ప్రపంచంలో ఏం జరుగుతోందో తెలియదు. సంబంధం ఉండదు. అలా అనుకుంటూంటే భయం వెయ్యలేదు. పిచ్చి ధైర్యం. మొండిధైర్యం. నాకే తెలీదు ఎక్కడినుంచి వచ్చిందో......

ఎందుకైనా మంచిదని మరోసారి అన్నివైపులా చూసాను. కిందకి  కూడా చూస్తున్నాను. సరిగ్గా అదే సమయానికి ఏవో గుసగుసలు నాకు వినిపించాయి. అంటే నేను కాకుండా ఇంకా ఎవరో అక్కడ ఉన్నారు.

“ నేను నిన్ను నిజంగానే ప్రేమిస్తున్నాను. నన్ను నమ్ము నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. దాని గురించి ఆలోచించ మంటున్నాను. మీ అమ్మా వాళ్ళని నేను ఒప్పిస్తాను ” ఓ మొగ గొంతు.

ఒక్కసారి భయపడ్డాను. కొయ్యబారి పోయాను. ఆర్ణవ్ అక్కడ ఉన్నాడా? ఇక్కడికి వచ్చాడా? నేనెలా ఉన్నానో చూడడానికి వచ్చాడా? అవి ఆర్ణవ్ మాటలు. ఆర్ణవ్ పోయాడు కదా పోయిన వాళ్ళు వస్తారా? రివెంజ్ తీసుకోడానికి వచ్చాడా? అంటే దెయ్యం!  ఆ తర్వాత ఆలోచించడానికి భయపడ్డాను. ఆ మాటలు నన్ను ఉద్దేశించి ఎవరైనా అంటున్నారా?  నన్ను కాదు అని చాలా సేపటికి తెలుసుకున్నాను.

అంటే అక్కడ  నేను కాక  ఇంకా ఎవరో ఉన్నారు, ఎవరు  వాళ్ళు? నన్ను చూసారా? చూసి ఉండరు.  వాళ్ళెవరో నాకన్నా ముందే వచ్చారు.  ఈ టాంక్ వెనకాల ఉన్నారు. వాళ్ళకి నేను కనపడే అవకాశమే లేదు

“నేను నిన్ను ప్రేమిస్తున్నాను ” మళ్ళీ అదే మాటలు. అక్కడ ఆర్ణవ్ ఉన్నట్లుగా అనిపిస్తోంది.

అయోమయం. అక్కడ ఎవరున్నారో తెలీదు, కాని ఇలాగే ఇవే మాటలు నాతో ఆర్ణవ్ అన్నాడు. ఇప్పుడు అక్కడ ఉన్నది ఆర్ణవ్ కాదు. ఆర్ణవ్ ఎలా వస్తాడు? చచ్చి పోయాడు కదా, నామూలంగానే ఆ ఆలోచనకి. ఒక్కసారి నా వెన్నెముకలోంచి కరెంటు ప్రవహించినట్లయింది.

అది ఆర్ణవ్ కాదు,ఇక్కడ మరొక మనిషి ఉన్నాడు. ఎవరో చూడడం కోసం పక్కకి జరిగి ఓ రెండు అడుగులు వేసి అటువైపు చూసాను.

" నా ప్రేమని అవమానించకు.. తేలిగ్గా చూడకు " సరిగ్గా ఇవే మాటల్ని ఆర్నవ్ బొమ్మ నాతో అంది.

నేను ఆర్నవ్ ని అవమానించలేదు.నా కలల్ని ,ఆశలని నిజం చేసు కోవాలను కుంటున్నాని అన్నాను. ఆ లక్ష్యం ముందు ప్రేమ చాలా చిన్నది అని కూడా అన్నాను. దానికే ప్రాణాలు తీసుకుంటాడా ఆర్ణవ్? కళ్ళ ముందు ప్రేమతో అన్న మాటలు, ఆ గొంతులోని మార్దవం అన్ని వినిపిస్తున్నాయి. నేను దోషినా! కావచ్చు. కాని నేను తప్పించుకున్నాను. నేను చాలా సెల్ఫిష్. నాది నేను చూసుకున్నాను. నేను సేఫ్ జోన్ లో ఉండడంకోసం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వణికిపోతున్నాను. చెమటలు పట్టెస్తున్నాయి. కాళ్ళకింద నేల కదులు తున్నట్లుగా అనిపించింది. కాని ఒక్క ఇంచి కూడా కదల్లేక పోయాను.

ఆర్ణవ్ చేసిన దానికి అందరూ బాధ పడ్డారు, ఆర్ణవ్ ఓ బలహీనక్షణం లో తీసుకున్న బలమైన నిర్ణయం అది. అనాలోచితంగా చేసాడు. అని అన్నారు,

అంటే ఇప్పుడు నేను కూడానా  అలాంటి బలహీనమైన స్థితిలో ఉన్నానా అవును. ఉన్నాను. అందుకే  ఆ రోజున ఆర్ణవ్ చేసిందే ఈరోజు నేను చేయబోతున్నాను. అంటే నాది కూడా అలాంటి బలహీన క్షణంలో తీసుకున్న నిర్ణయం అవుతుందా . కానీ ఇది ఇప్పటికిప్పుడు నేను తీసుకున్న నిర్ణయం కాదు. ఎప్పటి నుంచో నాలో ఈ ఆలోచన ఉంది. ఇంకా ఇక్కడే ఉంటే ఈ బలహీన క్షణం ఇంకా బలహీన పడిపోతోంది. ఏంచెయ్యను, అక్కడే అలాగే నుంచుని ఆలోచిస్తున్నాను.

"శృతీ ఇక్కడేంచేస్తున్నావ్?" చీకట్లోంచి అమ్మ గొంతు వినిపించింది. ఆ గొంతులో భయం, ఆశ్చర్యం, ఏడుపు,అన్నీ ఉన్నాయి. ఉలిక్కి పడ్డాను . ఊహించని విధంగా అమ్మ గొంతు వినపడేసరికి భయం వేసింది.

నాకు ఏం చెప్పాలో తెలీలేదు. నేను ఆత్మహత్య చేసుకోడానికి వచ్చానని ఎలా చెప్తాను.  అందుకే ఏం మాట్లాడ లేదు.

" నువ్వు నిద్ర పోయావో లేదో చూద్దామని, నీ గదిలోకి వచ్చాను. నువ్వు లేవు.  బాత్రూంలో కూడా లేవు. మెయిన్ తలుపులు తీసి ఉన్నాయి. కిందకి దిగి సెక్యూరిటి ని అడిగాను. నిన్ను చూడలేదని అన్నాడు. వెంటనే పైకి వచ్చాను.  చెప్పు...ఎందుకొచ్చావు?  ఏంవిటిది ? ఇందుకేనా సాయంత్రం ఈ టెర్రేస్ మీదకి వచ్చావు చెప్పు. ఏం చేయాలనుకుని ఇక్కడికి వచ్చావ్"  ఏడుపు గొంతుతో చేతుల్ని పట్టుకుంది. వెంటనే ఆ చేతుల్ని తన మొహానికి ఆనించుకుని ఏడ్చేసింది. ఆ నిశ్శబ్దంలో ఆమె ఎక్కిళ్ళ  ఆ శబ్దం బయిటికి రాకుండా చీర కొంగుని నోట్లో కుక్కుకుంది.

నాకేం చెప్పాలో తెలీడం లేదు. ఎందుకొచ్చానో సరిగ్గా చెప్పలేను. చెప్పలేదు. కాని నా ఆలోచనని అర్థం చేసుకుందేమో అనిపించింది. నన్ను గట్టిగా కౌగిలించుకుంది.

ఆ పక్కనే నిశ్శబ్ధంగా ఏడుస్తున్న గొంతు . అమ్మ భుజం మీదనుంచి చూసాను. ఆ చీకట్లో  ఓ నీడలా అమ్మ పక్కనే ఉన్న మనిషి , నాన్న . ఆయన ఏడుపు పైకి రాకుండా, ఆయన చేసే ప్రయత్నం

ఆ భుజాల కదలికని చూసి గుర్తు పట్టగలను. నాన్నగారు ఏడవగా ఎప్పుడూ చూడలేదు. చాలా ధైర్యం గల మనిషి. అలాంటి నాన్న ఈ క్షణాన, ఓడిపోయి నట్లుగా  నా ముందు నుంచున్నారు.    నిస్సహాయంగా తలని బాగా వొంచి నుంచున్నారు. ఆయన ఇన్నేళ్ళూ తన జీవితాన్ని దిద్దుకున్నారు. మా జీవితాలని దిద్దుతూ వచ్చారు. ఏ లోటు లేకుండా పెంచారు .అంతా మంచే చేసారు. ఓ నాన్నలాగా అన్నిమాకు చేసారు.

అలాంటి నాన్న ఇప్పుడు నా మూలంగా ఇలా అన్నీ పోగొట్టుకున్నట్లుగా నా ఎదురుగా నుంచున్నారు. ఒక్కమాట కూడా అనలేదు. కోపంగా చూడలేదు. అరవలేదు. తిట్టలేదు.అలా చేసినా బావుండేది. ఆ మాటల్ని భరించగలను. కాని ఈ మౌనం ,నిశ్శబ్ధం  భరించ లేకపోతున్నాను.

అదే నిశ్శబ్ధం తో కళ్ళు తుడుచుకున్నారు. అమ్మ ఓ చేత్తో నా పొదివి మరో చేత్తో నా చేయి పట్టుకుని ముందుకి నడిచింది. నాన్నఅమ్మభుజం చుట్టూ చేయి వేసి, మా ఇద్దర్నీ నడిపిస్తున్నారు. ఆరో అంతస్తులో ఉన్న మా ఇంటికి తీసుకెళ్ళారు.

నా గదిలోకి రాగానే  “సారీ..”.అని ఒక్కసారి ఏడ్చేసాను. నాన్న నా తల నిమురుతూ నిశ్శబ్ధంగా ఉన్నారు. అమ్మ కింద కూచుని మొహం కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఓ నాలుగురోజులు ఎవరం ఎవరితో మాట్లాడుకోలేదు. కానీ నాన్నగారు మాత్రం ఎవరికో ఫోన్ లు చేస్తున్నారు, ఏవో కనుకుంటున్నారు.

“ రేపు పొద్దున్న ఎనిమిది గంటలకి మరో డాక్టరు దగ్గరికి వెళ్తున్నాం. అన్ని కనుకున్నాను. ఇతను చాలా పెద్ద సైకియాట్రిస్ట్. అతను పరీక్షించి చెప్తాడుట. బెంగులూరులో పని చేసి వచ్చాడు. చూద్దాం. అన్నీ మంచే జరుగు తుందనే అనుకుందాం. ఇంతవరకూ ఇద్దరయ్యారు. ఇతను మూడో మనిషి.  మూడో డాక్టరు. మూడోసారి ప్రయత్నిద్దాం. మన ప్రయత్నంలో  లోపం ఉండకూడదు ”

మర్నాడు, అందరం ఓ పాత ఇండిపెండెంట్ బంగ్లా కి వెళ్ళాం, అది ఎవరిదో ఇల్లులా ఉంది. గేటునుంచి కొంచెం దూరం నడిచాకా మెట్లు ఎక్కి, ఓ వరండా లోకి వెళ్ళాం. తిరుగుతున్న ఫాన్లూ,నున్నటి గోడలు,కొటేషన్లతో ఉన్న పెయింటింగ్ లూ,ఏదో హోటల్ లోని రిసెప్షన్ హాలులా ఉంది.అక్కడన్నీ చిల్లులున్న ఇనప  సిల్వర్ రంగు కుర్చీలున్నాయి. ఓ పది మంది కూచుని ఉన్నారు. ఆ తర్వాత పెద్ద గది అని పొడుగ్గా ఉన్న గోడని చూస్తే తెలుస్తోంది. గాజు తలుపులున్న ఆ గది పక్కనే గోడకి ముగ్గురు డాక్టర్ల పేర్లు రాసి ఉన్న మూడు చిన్న బోర్డులున్నాయి..

ఇది మూడోసారి. మూడో డాక్టరు. మూడోసారి నా జీవితాన్ని,ఇతని ముందు తెరుస్తాను. అని మనసులో అనుకున్నాను.

నా వంతు వచ్చింది. నర్సు ఓ నంబరు గట్టిగా పిలిచింది.

అమ్మ నాన్న ఇద్దరూ ఒక్కసారి లేచారు. నేను లేవలేదు. కాని  “ అమ్మ లే అది నీ నంబరే. ఇక్కడ పేర్లు పెట్టి పిలవరు ” అని నన్ను కూడా లెమ్మన్నట్లు తట్టారు.

నా పేరు పిలవలేదు. నాపేరు ఆమెకి అక్కర్లేదు. ఇప్పుడు నేను ఓ నంబరు గా మాత్రమే గుర్తింపబడతాను. నా పేరు లేనప్పుడు నా ఎక్సిస్టెన్స్ ఉన్నట్టా లేనట్టా !

ముగ్గురం తలుపు తెరుచుకుని గదిలోకి వెళ్ళాం. తలుపులు ఆటోమాటిక్ గా మూసుకుపోయాయి . భయపడిపోయాను ఓ సారి మూసుకున్న తలుపులు వైపు చూసి, ఓ పెద్ద టేబుల్ వెనక కూచున్న వాళ్ళని భయంగా చూసాను.

“ కూచోండి ” అన్న మనిషిని చూసాను.టేబుల్ కి ఇవతల వైపున్న కుర్చీల్లో మేము కూచున్నాం.

మనిషి చామనఛాయ, చిన్న గడ్డం. సన్నమీసాలు. నల్ల ఫ్రేమున్న కళ్ళద్దాలు. మరీ లావు కాదు, మనిషి ఎలా ఉన్నా గొంతు బావుంది, వెంటనే ప్రద్యుమ్న గుర్తొచ్చాడు. ప్రద్యుమ్న గొంతు కూడా చాలా బావుంటుంది. మంచి హిందీ పాటలు పాడి దాని అర్థం,దాని లోతు ,చెప్పేవాడు. నేనెందుకు రావడంలేదో అతనికి తెలీదు. తెలిస్తే ఎలా ప్రవర్తిస్తాడు. ఎలా తెలుస్తుంది. తెలిసే అవకాశమే లేదు

“ నీ పేరు ఏంవిటీ? ”

చెప్పాను.

“ అడిగినదానికి నీకు తోచిన జవాబులు ఇయ్యి ”

ఇది వరకూ కూడా ఇద్దరు డాక్టర్లు ఇలాగే అన్నారు. ప్రశ్నలు అడిగారు. నేను సమాధానాలు ఇచ్చాను. కానీ ఏం జరిగింది ? ఏం జరగలేదు. నేను రోజు రోజుకి నిరాశలో కూరుకుపోతున్నాను. నాకు తెలుసు, ఇప్పుడు కూడా అదే జరగబోతోంది.

అంతలో ఓ అసిస్టెంట్ వచ్చారు. డాక్టరుగారు ఏవో అడిగారు. నేను ఏం చెప్పానో నాకు తెలీదు. కాని జవాబులిచ్చాను. నేను మాట్లాడినదంతా రికార్డు చేస్తున్నారు. డాక్టరు కూడా రాసుకుంటున్నారు. ఆయన రాసుకోవడం పూర్తయ్యాకా నా వైపు చూసారు. ఆధునిక పరికరాల సాయంతో పని చేస్తున్న ఈ టీం, వీళ్ళ ప్రొసీజర్ ఏదో బాగానే ఉన్నట్టనిపించింది. ఇంతకు ముందు ఇద్దరు ఇలాగా లేరు. వాళ్ళిద్దరూ కూడా ఓ మామూలు డాక్టర్లలా క్లినిక్ పెట్టుకున్నారు. ఇది అలా లేదు. ఏదో హోటల్ గదిలా ఉంది.ఇక్కడ ఇద్దరు డాక్టర్లున్నారు. నేను చెప్పింది విన్నారు. రికార్డు చేసారు. ఇది డిఫరెంటుగా ఉంది. అయినా కొంచెం సంతృప్తిగానే ఉంది.

“నువ్వు బయట కూచో. మీ పేరెంట్స్ తో మేము మాట్లాడాలి. మరో ముగ్గురు డాక్టర్లతో చర్చించాలి ” నేను బయటికి వచ్చేసి అక్కడున్న ఓ ఇనప కుర్చీలో కూచున్నాను. చుట్టూ చూసాను. ఓ ఇద్దరు పేషెంట్లు,వాళ్ళ తాలూకూ బంధువులుఉన్నారు. ఎవరూ ఎవరితో మాట్లాడుకోవడం లేదు. అంతా నిశ్శబ్దంగా ఉన్నారు.

ఓ పావుగంట తరవాత అమ్మా ,నాన్న బయటికి వచ్చారు. వాళ్ళ మొహాల్లో సంతోషం లేదు. బాధగా ఉన్నాయి.

“ శృతీ నీ గురించి చాలా మాట్లాడారు. నిన్ను, అబ్సర్వేషన్లో పెడితేనే మంచిదన్నారు ”

నా నోట మాట రాలేదు. నా కేసంతా సీరియస్సా? ఆ సంగతి అంతకు ముందు డాక్టర్లకి తెలియలేదా ? లేకపోతే ఈ మూడు నెలల్లో ఎక్కుయిందా? అంటే ఇప్పుడు నేను మామూలుగా లేనా, మామూలుగా లేను అందుకే ఇప్పుడు నేను హాస్పిటల్ లో ఇన్ పేషెంటుగా ఉంచి అబ్సర్వ్ చేస్తారా?

" మరి మీరేం అన్నారు....?" అన్నాను ఆందోళనగా .

" సరే అన్నాం. నువ్వు తొందరగా బాగా అయిపోతావని అన్నారు. మాకు అదే కావాలి. అందుకే సరే అన్నాం "

ఒక్కసారి ఏడ్చేసాను.

"సరే అన్నారా. ఎలా అన్నారు.? ఎందుకన్నారూ? నేనేం ఉండను. నన్ను మీతో తీసుకెళ్ళిపోండి. నేను మీకు ఎలాంటి ప్రాబ్లెం ఇవ్వను. నేను మంచిగా ఉంటాను మీకు ప్రామిస్ చేస్తున్నాను. ఏం గొడవ చెయ్యను. చచ్పోతానని అనను. కావాలంటే కాలేజీకి కూడా వెళ్తాను. హాస్పటల్లో అడ్మిట్ అవడం అంటేనే భయం " నేను ఏడ్చేసాను. అమ్మకూడా కళ్ళు తుడుచుకుంది..

" నిన్నిక్కడ ఉంచడం మాక్కూడా ఇష్టం లేదు. వాళ్ళు ఇచ్చిన సమాధానాలు విన్నాకా సరే అన్నాం. తప్పదు, ఇదే మనందరికీ మంచిది. ఇలా ఈ స్థితిలో ఎన్నాళ్ళుండ గలవు? నీకు తగ్గుతున్నట్లుగా అనిపించడం లేదు, ఇప్పటికే ఇద్దరి దగ్గరికి తీసుకెళ్ళాం. ఏం జరిగిందో నీకు తెలుసు, మాకు తెలుసూ. మరో ప్రయత్నం చేద్దాం. చెయ్యడంలో తప్పులేదు కదమ్మా. ఇతను మన దేశంలో ఉన్న మంచి డాక్టరని అంతా అన్నారు. పైగా బెంగలూరు ఇన్సిటిట్యూట్ లో చాలా ఏళ్ళు పనిచేసాడుట, నిన్ను బాగా చూసుకుంటారని డాక్టరుగారి మాటల్ని బట్టి మాకు అర్థం అయింది " అంది అమ్మ కళ్ళు తుడుచుకుంటూ అంది. నాన్న గంభీరంగా దిక్కులు చూస్తున్నారు.

ఓ గంట తరవాత మేము డాక్టరు గారు చెప్పిన ఆసుపత్రికి వెళ్ళాం. అది సిటీకి చాలా దూరంలో ఉంది. అసలు అక్కడ ఆసుపత్రి ఉందని కూడా ఎవరికీ తెలీదు. అక్కడ ఓ పెద్ద బోర్డుంది. దానిమీద మెంటల్ హెల్త్ అండ్ న్యూరోలాజికల్ సైన్సెస్ అని రాసి ఉంది.మెంటల్ హెల్త్ అంటే ఆ తరవాత ఇంక ఆలోచించడానికి ఏం లేదు. అంటే నేను ఓ మెంటల్ హాస్పిటల్ లో అడ్మిట్ అవుతున్నానా ? అంటే నేను నిజంగా ఓ పిచ్చి దానినా? సైకలాజికల్ గా నాలో సమస్యలున్నాయా? నేను మామూలుగానే ఉంటున్నాను కదా? అయినా కూడానా. నమ్మలేకపోతున్నాను. నాకు నేను మామూలుగా ఉన్నట్టుగా అనిపిస్తోంది. వీళ్ళ దృష్టిలో నేను నార్మల్ గా లేను. అందుకే ఇక్కడ ఉంచుతున్నారు. చుట్టూ పరికించి చూసాను. ఇది ఓ ఆసుపత్రిలాగా లేదు. కొత్తగా కట్టిన ఓ కాలేజీలా, ఉంది. పొడుగ్గా ఉన్న ఓ రెండంతస్థుల బిల్డింగ్ చుట్టూరా చెట్లు. చాలా స్థలం. కాంపొండు,

లోపలికి వెళ్ళాం. అందరం ఓ గదిలోకి వెళ్ళాం, అందంగా లేత పసుపు రంగు గోడలు.గోడలకి సీనరీలు, పువ్వులు ఉన్నపెయింటింగ్ లు. అక్కడ కుర్చీలు. మళ్ళా వెయిటింగ్. ఆ హాల్లో చాలా మంది, వాళ్ళ తాలూకు వాళ్ళు ఉన్నారు. ఎవరూ కూడా పిచ్చి వాళ్ళ ల్లాగా కనిపించలేదు. అంతా మామూలుగా కనిపిస్తున్నారు. నేను కూడా అంతే కదా, పైకి మామూలుగానే ఉంటున్నాను. కానీ నన్ను ఇక్కడికి తీసుకొచ్చారు .

మళ్ళీ నంబరు పెట్టి పిలిచారు. ముగ్గురం లోపలికి వెళ్ళాం. నాన్న అంతా చెప్పారు. ముగ్గురం కుర్చీల్లో కూచున్నాం. అంతకు ముందు డాక్టరిచ్చిన రిపోర్టులన్నీ ఇచ్చాం. ఆయన వెంటనే చూసి సిస్టర్ ని పిలిచారు, నన్ను తీసుకెళ్ళమని చెప్పారు.

మమ్మల్ని సిస్టర్ రమ్మంది.అమ్మా నాన్నకూడా మా వెనకాలే వచ్చారు

"శృతీ ,ఇది నీ గది. ఇక్కడ నువ్వుండాలి "నాకు ఇచ్చిన గదిని అమ్మా వాళ్ళు కూడా చూసారు. కాస్సేవున్నారు. వాళ్ళు వెళ్ళి పోతూంటే చిన్నపిల్లలా గట్టిగా ఏడ్చాను.

“ఛ.ఛ చిన్నపిల్లలా ఆ ఏడుపేంటీ.? వీళ్ళందరూ నిన్ను బాగా చూసుకుంటారు. ఏం భయం లేదు. నువ్వు మళ్ళీ మామూలుగా అయిపోతావు ” అని మెల్లిగా చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు.

ఒక్కదాన్నిఆ గదిలో, మళ్ళీ ఇదివరకు లాంటి ఫీలింగ్స్. భయం. నాకు అమ్మకావాలి. కాని అమ్మకి నేనక్కర్లేదు . అమ్మ కూడా నాలాగే ఫీల్ అవుతుందనుకున్నాను కాని లేదు. తల తిప్పుకుని వెళ్ళిపోయింది. నాన్నకూడా అంతే. నన్ను వదిలేయడానికి ఎలా ఒప్పుకున్నారు

నన్ను ఇక్కడ అడ్మిట్ చేసి వెళ్ళిపోయారు. కోపం వచ్చేస్తోంది, కోపం ఎలా తగ్గుతుంది ? పిడికిళ్ళు బిగించాను. అక్కడున్న తలుపు మీద కొట్టాను. ఆ చర్యని అడ్డుకోడం కోసం నా చేతిని వెంటనే సిస్టర్ పట్టుకుంది. నన్ను గట్టిగా ఓ పక్కకి లాగింది. నాకు ఇంకా కోపం వచ్చింది. నేను ఏంచేస్తున్నానో నాకే తెలీదు. అంతే నేను ఆమెని కొట్టాను. ఇక్కడ నేనుండను, అంటే వినిపించుకోవేంటీ ? అసలు నువ్వెవరు నన్ను పట్టుకోడానికి ? “ అని గట్టిగా అరిచాను. సిస్టర్ నన్ను పట్టుకుని ఏదో నచ్చ చెప్ప బోయింది.

“ చెప్తూంటే అర్థం అవడంలేదా?” మరోసారి అరిచాను. అయినా ఆమె ఏదో అనబోతోంది. నా మాటని లెఖ్ఖచెయ్యడం లేదని కోపం వచ్చేస్తోంది.

“నన్ను వదలండి” అని గట్టిగా అరిచాను. నా గొంతు పెంచానని నాకు తెలీదు. ఆమె ఏం మాట్లాడలేదు. మరో సిస్టర్ కూడా ఆ పక్కనే ఉంది. ఆమె చేతిలో ఓ సిరంజ్ ఉంది. ఓ ఆయా వచ్చింది. ఆమె నన్ను పట్టుకుంది. అటూ ఇటూ గింజుకున్నాను. ఆమె చెంప మీద ఒక్క లెంపకాయ ఇవ్వాలని ఉంది. కాని కుదరదు. ఎందుకంటే వాళ్ళు నా చేతులు పట్టుకున్నారు, కాలు స్వేచ్ఛగా ఉంది. అంతే కాలితో ఒక్క తన్ను తన్నాను.

( కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments